క్లుప్తంగా

మంత్రికి శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఆహ్వానం



మంత్రిని ఆహ్వానిస్తున్న శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి సభ్యులు

నగరి : రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి ఆర్కే రోజాను శ్రీకాళహస్తి దేవస్థానం పాలక మండలి సభ్యులు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. మంగళవారం నగరిలోని మంత్రి నివాసానికి విచ్చేసిన శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను గౌరవ పూర్వకంగా మంత్రి ఆర్కేరోజాకు అందజేశారు.

ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ దివ్య

కార్వేటినగరం: మండలంలోని కొల్లాగుంటలో ఏర్పాటుచేసిన ఆధార్ స్పెషల్ క్యాంపును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దివ్య తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రజల సౌకర్యం కోసం కొల్లాగుంట ఎంపీయూపీ పాఠశాలలో రెండు రోజుల స్పెషల్ క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. మండల కో ఆప్షన్ సభ్యుడు పట్నం ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి కేశవులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ప్లేట్ల వితరణ



ప్లేట్లు అందజేసిన చిరంజీవి

వెదురుకుప్పం: మండలంలోని ఆళ్లమడుగు దళితవాడలో అంగన్‌వాడీ పిల్లలకు అదే గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ చిరంజీవి మంగళవారం ప్లేట్లు వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద పిల్లలకు చేయూత ఇవ్వాలన్న ఉద్దేశంతో ప్లేట్లు అందజేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో కూడా సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో దిగువపల్లాలు పంచాయతీ కార్యదర్శి మునిరాజు, మహిళా పోలీసు అమృత, అంగన్‌వాడీ కార్యకర్త పార్వతి పాల్గొన్నారు.

పాలకొండ అడవికి నిప్పు



పాలసముద్రం సమీపంలో మండుతున్న పాలకొండ అడవి

పాలసముద్రం : మండలంలోని పాలకొండ, పాలసముద్రం గ్రామం సమీపంలో ఉన్న అడవికి మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. దీంతో సుమారు 550 హెక్టార్లలోని చెట్లు కాలిబూడిదయ్యాయి. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దుండగులు అడవులకు నిప్పు పెడుతున్నా అటవీ శాఖాధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలో మిగిలి వున్న అడవులకు నిప్పు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొట్రకోన మల్లీశ్వరస్వామి ఆలయంలో మహాకుంభాభిషేకం

గంగాధరనెల్లూరు: కొట్రకోన గ్రామంలో ఉన్న మల్లీశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 12న మహాకుంభాభిషేకం, జీర్ణోద్ధరణ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రామూర్తినాయుడు, ప్రధాన కార్యదర్శి యుగంధరాచారి, గౌరవాధ్యక్షురాలు సుభాషిణి తెలిపారు. 10వ తేదీ సాయంత్రం గణపతిపూజ, అనుజ్ఞ, గణపతి హోమం, నవగ్రహహోమం, ధనపూజ, గోపూజ, వాస్తుశాంతి, అంకురార్పణ, యాగశాల పూజా హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. 11న రెండో కాల యాగశాల పూజా హోమం, అష్టదళ పూజ, నేత్రదర్శనం ఉంటాయని పేర్కొన్నారు. 12న ఉదయం ఏడు గంటలలకు మహాకుంభాభిషేకం వేడుకలు నిర్వహిస్తామన్నారు.

ఘనంగా రమాబాయి జయంతి

వడమాలపేట : మండలంలోని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రమాబాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం వడమాలపేటలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రమాబాయి రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు ఎంతో సహయ సహకారాలు అందించారని కొనియాడారు. పేదల ప్రజల అభ్యున్నతికి ఆమె కృషి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి మునిబాబు, సలహాదారులు డేవిడ్, వెంకటేష్, మండల అధ్యక్షుడు జయంతి బాబు, సంఘం సభ్యులు రాజశేఖర్, సాంబా, దామోదర్, సతీష్, క్రాంతి, సాయికృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి విజయసారథులు మీరే



నగరి: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్కేరోజా



సమావేశానికి హాజరైన గృహసారథులు, వలంటీర్లు

- మంత్రి ఆర్కేరోజా

నగరి : వైఎస్సార్ సీపీ గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లే రేపటి విజయసారథులని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. మంగళవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన పుత్తూరు మండల గృహసారథులు, కన్వీనర్ల సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రసంగించారు. ఏ పార్టీకి లేనంత పటిష్టమైన వ్యవస్థ మనకు ఉందని, మీరందరూ కష్టపడి పని చేస్తే రానున్న ఎన్నికల్లో మనకు అధికారం సునాయసమేనన్నారు. వైఎస్సార్ సీపీది సుదీర్ఘమైన ప్రయాణం అన్నారు. పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు తప్పకుండా న్యాయం జరుగుతుందని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంత పారదర్శకంగా, ఇంత పెద్ద స్థాయిలో సంక్షేమం ఏ ప్రభుత్వం అమలు చేయలేదని తెలిపారు. ఏ పార్టీకి, ఏ గుర్తుకు ఓటు వేసినా వివక్షత లేకుండా సంక్షేమం పారదర్శకంగా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సమర్థవంతంగా పనిచేయాలని, ప్రభుత్వ నిర్దేశించిన అంశాలను పక్కాగా పాటించాలన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు రానున్న రోజుల్లో కీలక భూమిక పోషించాల్సి ఉంటుందన్నారు. గృహసారథులు తమ పరిధిలోని 50 ఇళ్లల్లో ప్రతి గృహానికి వెళ్లి వారితో మంచి, చెడ్డ మాట్లాడి, వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సంక్షేమ పథకాల వివరాలతో పాటు ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న కుట్రలు, కుతంత్రాలు కూడా ప్రజలకు వివరించాలని ఆమె సూచించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు హయాంలో అర్హత ఉన్నా పేదలకు ఇళ్లు ఇవ్వలేదని, కానీ నేడు వేలాది ఎకరాలు రూ.వేల కోట్లు వెచ్చించి కొనుగోలు చేసి, పేదల సొంత ఇంటి కల నెరవేరుస్తున్న ఘనత ముఖ్యమంత్రికి మాత్రమే దక్కుతుందన్నారు. మహిళా సాధికారతకు ఈ ప్రభుత్వం నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీలు మునస్వామిరెడ్డి, విమల, సచివాలయాల మండల కన్వీనర్ భాస్కర్ యాదవ్, గోవిందస్వామిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు రామభక్తయ్య తదితరులు పాల్గొన్నారు.



నింద్ర: ఎంసీ కండ్రిగలో తాగునీటి కొళాయిని ప్రారంభిస్తున్న మంత్రి ఆర్కే రోజా

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

నింద్ర: ప్రతి గ్రామం అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం అని మంత్రి ఆర్కే రోజా అన్నారు. మండలంలోని జీఎస్ కండ్రిగ పంచాయతీలోని తాగునీటి పథకాలను మంగళవారం మంత్రి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదలు, రైతులు, మహిళలను ఆదరిస్తుందని చెప్పారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో గ్రామీణ ప్రజల సమస్యలు వారి గ్రామంలోనే పరిష్కారం అవుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, రాంప్రసాద్ రెడ్డి, తహసీల్దార్ అమరేంద్రబాబు, ఎంపీడీఓ వేణు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యవజన విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, సింగిల్ విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మంజుల, కోఆప్షన్ సభ్యుడు అనీల్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దామోదరం, పార్టీ మండల కన్వీనర్ వేణురాజు, ఆర్బీకే చైర్మన్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు 75 శాతం హాజరు తప్పనిసరి



ఉపాధి సిబ్బందితో సమీక్షిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్‌బాబు

కార్వేటినగరం: ఉపాధి పనుల్లో ప్రతిరోజూ 75 శాతం మంది కూలీలు హాజరయ్యేలా చూడాలని ఉపాధి హామీ నగరి అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్‌బాబు ఆదేశించారు. ఆయన మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీఓ మోహన్‌మురళి ఆధ్వర్యంలో ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రోజూ 20 మంది కూలీల సంఖ్య పెరిగేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న కూలీలకు ఆధార్ సీడింగ్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, జేఈలు కలిసి కూలీలు చేసిన పనుల వివరాలను మానిటర్ చేసి ప్రాజెక్టు డైరెక్టర్‌కు అందించాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయడానికి టీఏలు సిద్ధం కావాలని సూచించారు. ఏపీవో జాహ్నవి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మధు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ చేస్తున్న ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి మోహన్‌కృష్ణ వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలను ఆదేశించారు. ఆయన మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశా నోడల్ ఆఫీసర్ సుశీల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జ్వరం, దగ్గు, జలుబు తదితర సీజనల్ వ్యాధులతో బాధపడేవారిని ఆస్పత్రికి తరలించాలన్నారు. గ్రామాల్లో దోమలు వృద్ధి చెందకుండా మాలాథిన్ మందు పిచికారీ చేయాలని తెలిపారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఏపీడీ సుబ్రమణ్యం

పాలసముద్రం : ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని చిత్తూరు క్లస్టర్ ఏపీడీ సుబ్రమణ్యం ఆదేశించారు. ఆయన మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీఓ విద్యావతితో కలిసి ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలని, నెలలో 15 వేల పని దినాలు పూర్తి చేయించాలని ఏపీఓ బాలను ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్షంగా వ్యవహరిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. జేఈ అనుషా, టెక్నికల్ అసిస్టెంట్ సుబ్రమణ్యం, భూపతి, రంగనాథం తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్లతో వ్యవసాయం లాభసాటి



డ్రోన్ పిచికారీ విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

పిచ్చాటూరు: వ్యవసాయ రంగంలో డ్రోన్ల వాడకం వైపు మొగ్గు చూపితే రైతాంగానికి కూలీల ఖర్చులు, సమయం ఎంతో ఆదా అవుతుందని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. డ్రోన్‌తో పంటలకు పురుగు మందుల పిచికారీపై తులసి కృష్ణాపురంలో ప్రదర్శన పూర్వకంగా మండల వ్యవసాయ శాఖ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసింది. కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ డ్రోన్‌తో ఎకరం పంటకు 6 నుంచి 8 నిమిషాలలో మందును పిచికారీ చేయవచ్చన్నారు. ఎకరాకు 10 లీటర్ల నీరు సరిపోతుందని, సాధారణ పద్ధతిలో వాడే పురుగు మందు 15 నుంచి 25 శాతం ఆదా అవుతుందని, అలాగే కూలీల ఖర్చు తగ్గి, సమయం ఆదా అవుతుందన్నారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మండల వ్యవసాయ అధికారి సంజీవ రెడ్డి మాట్లాడుతూ, పొద్దుతిరుగుడు పంటలో పొగాకు లద్దె పురుగు నివారణకు ఎమామేక్టిన్ బెంజోయేట్ లీటరు నీటికి 0.4 మి.లీ. చొప్పున పిచికారీ చేయాలన్నారు. అనంతరం రైతులకు పురుగు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు దివ్య, రామ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు రాఘమ్మ, వ్యవసాయ సహాయకులు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాలుర ఉన్నత పాఠశాల తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈఓ రఘురామయ్య

నారాయణవనం: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలను పుత్తూరు డీవైఈఓ రఘురామయ్య మంగళవారం తనిఖీ చేశారు. ప్యానల్ తనిఖీ బృందంతో ఆయన సాయంత్రం వరకు పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షించారు. అనంతరం టీచర్లతో సమీక్షించారు. పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలన్నారు. చదువులో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆనందబాబు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం నేడు

నగరి : మున్సిపల్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను బుధవారం ఉదయం 10 గంటలకు వేలం వేస్తున్నట్లు ఎస్‌ఈబీ సీఐ వర్ధనాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతలపట్టెడలోని ఎస్‌ఈబీ కార్యాలయ ఆవరణలో వేలం పాటలు నిర్వహిస్తామన్నారు. సదరు వేలం పాటల్లో పాల్గొనే వారు తప్పనిసరిగా జీఎస్‌టీ కల్గి ఉండాలన్నారు.

వైభవంగా ఊరేగింపు



అమ్మవారి ఊరేగింపు

నగరి : మండలంలోని ఎం.కొత్తురులోని అంగముత్తు పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న తిరనాళ్లలో భాగంగా మంగళవారం అమ్మవారు, గుర్రప్పస్వామిని గ్రామంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

ఒకే ఈతలో రెండు దూడల జననం

శ్రీరంగరాజపురం : మండలంలోని కటికపల్లికి చెందిన రైతు విజయశాంతి ఆవు ఒకే ఈతలో రెండు దూడలను ఈనింది. సాధారణంగా ఆవు ఒక దూడను మాత్రమే ఈనుతుంది. రెండు దూడలను ఈనడంతో వాటిని చూడడానికి చుట్టుపక్కల ప్రజలు ఉత్సాహం చూపారు. రెండు దూడలు ఆరోగ్యంగా ఉన్నాయి.

రక్తహీనతపై గర్భిణులకు అవగాహన కల్పించండి

గంగాధరనెల్లూరు: మాతా శిశుమరణాలు లేకుండా ఆశా కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తూగుండ్రం పీహెచ్‌సీ వైద్యాధికారి దివ్య కోరారు. తూగుండ్రం పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం ఆశా కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులకు రక్తహీనతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను తెలియచేసి ప్రజలకు సేవలందించాలన్నారు. ఆరోగ్య విద్యాధికారి రాజేంద్రప్రసాద్, పీహెచ్‌ఎస్ శాంతి, సూపర్‌వైజర్లు వరలక్ష్మి, కృష్ణమ్మ పాల్గొన్నారు.

శివరాత్రి పోస్టర్ల ఆవిష్కరణ

నారాయణవనం: మండలంలోని ప్రఖ్యాత పర్యాటక కేంద్రమైన కైలాసనాథకోనలోని కామాక్షాంబిక సమేత కైలాసనాథస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవ పోస్టర్లను మంగళవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. శివరాత్రికి కైలాసకోనకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా అన్ని వసతులు కల్పించాలని, అన్నప్రసాదాలను అందజేయాలని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, ఆలయ పాలక మండలి చైర్మన్ సుబ్రమణ్యంయాదవ్, ఈఓ కృష్ణనాయక్, సింగిల్‌విండో చైర్మన్ ఊరప్ప, వైస్ ఎంపీపీ శివశంకర్ పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

చిత్తూరు అర్బన్: స్థానిక 17వ డివిజన్‌లోని సచివాలయాన్ని మంగళవారం జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. లబ్ధిదారుల వివరాలు నోటీస్ బోర్డులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. మూమెంట్ రిజిస్టర్ విధిగా ఉండాలన్నారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



రోగులకు ఫుడ్ గ్రెన్ బ్యాగ్‌లను పంపిణీ చేస్తున్న రవిరాజు

నింద్ర: అందరి సహకారంతో క్షయరహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా అడిషినల్ డీఎమ్‌హెచ్‌ఓ రవిరాజు అన్నారు. మంగళవారం నింద్ర పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలో క్షయవ్యాధి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మట్లాడుతూ వారానికి మించి జ్వరం, దగ్గు ఉంటే తప్పనిసరిగా గళ్ల పరీక్ష చేయించాలన్నారు. మధుమేహ రోగులకు మందులు అందజేయాలని ఆదేశించారు. ఫుడ్ గ్రెన్ బ్యాగ్‌లను ఆయన పంపిణీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కళ్యాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత కుమారస్వామిరెడ్డి

పుత్తూరు రూరల్: పట్టణంలోని వృద్ధాశ్రమంలో మంగళవారం పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్ సీపీ నేత వై.కుమారస్వామిరెడ్డి వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. రూరల్ మండలం వేపగుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ప్రభు తన తండ్రి ఏసువరం రెండో వర్ధంతి సందర్భంగా స్థానిక బధిర పాఠశాల విద్యార్థులు 40 మందికి అన్నదానం చేశారు. అలాగే వృద్ధాశ్రమంలోని వృద్ధులు 25 మందికి చీరలు పంపిణీతో పాటు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలు కుమారస్వామి రెడ్డి చేతుల మీదుగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైఎస్సార్ సీపీ నాయకులు మునయ్య, రాజా, సుదర్శనం, మోహన్‌రెడ్డి, జనార్ధన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానానికి స్థలం కేటాయింపు



స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ హరి, కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి

పుత్తూరు రూరల్: పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా చొరవతో మున్సిపాలిటీలోని 21వ వార్డు చెర్లోపల్లెలో శ్మశానానికి స్థలం కేటాయించినట్లు మున్సిపల్ చైర్మన్ ఏ.హరి తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో ఉన్న శ్మశానానికి దారి లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్న విషయం మంత్రి ఆర్కే రోజా దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. దారి సౌకర్యం కలిగిన మరో స్థలాన్ని కేటాయించాలన్న మంత్రి ఆదేశాల మేరకు మున్సిపల్, రెవెన్యూ అధికారులు రెండు రోజులుగా సర్వే చేసి, స్థలాన్ని కేటాయించారన్నారు. మంగళవారం ఆ స్థలంలో జేసీబీతో ముళ్లపొదలను తొలగించి చెర్లోపల్లి గ్రామస్తులకు శ్మశానానికి కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ ఎస్.జ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఈశ్వరయ్యయాదవ్, చిట్టిబాబు, మునయ్య, గోపాల్‌యాదవ్, శివయ్య, నీలకంఠరెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య వ్యర్థాలను ఏజెన్సీలకు అందజేయాలి

నగరి : మున్సిపల్ పరిధిలోని అన్ని ప్రైవేటు ఆస్పత్రులు, వైద్యపరీక్షల కేంద్రాల్లో వచ్చే హానికర వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయవద్దని, శాస్త్రీయ పద్ధతిలో నశింపజేసే ఏజెన్సీలకు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రుల్లో వైద్య వ్యర్థాలను డబ్బాల్లో వేసి, వాటిని నాశనం చేయడానికి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అనుమతి పొంది, హానికర వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నాశనం చేసే సంబంధిత ఏజెన్సీలకు మాత్రమే అందజేయాలన్నారు. అలా చేయకుంటే మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యాక్ట్ 2016, పురపాలక సంఘ చట్టం 1965 ప్రకారం జరిమాన విధించి చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పది విద్యార్థులకు అల్పాహారం పంపిణీ



విద్యార్థులకు బిస్కట్లు అందజేస్తున్న వైస్ ఎంపీపీ

నగరి : మండలంలోని తడుకుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులు 63 మందికి దాతలు అల్పాహారం అందజేశారు. వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సంజీవి రెడ్డి విద్యార్థులకు బిస్కట్లు, శెనగలు, అలసందలు పంపిణీ చేశారు. పరీక్షల వరకు ప్రతి రోజు సాయంత్రం విద్యార్థులకు పోషకాలు అందిస్తామని వైస్ ఎంపీపీ తెలిపారు.

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు



ఆన్‌లైన్‌లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శి కారుణ్య

కార్వేటినగరం: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు కలుగుతాయని డీఎంపురం సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి కారుణ్య తెలిపారు. ఆమె మంగళవారం డీఎం పురం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నమశ్శివాయం ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్య వివాహాలు, గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని తెలిపారు. గ్రామాల్లో బాల్య వివాహాలు, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులు, మహిళా సంరక్షణ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపి పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్

పాలసముద్రం : మండలంలోని బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్లపై ఉందని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఎమ్మార్సీలో మంగళవారం హెచ్‌ఎంలు, కమిటీ చైర్మన్లతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ నాడు–నేడు కింద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

వర్క్‌షాప్‌తో నైపుణ్యాలు పెంపు



విద్యార్థికి ప్రశంసా పత్రం, జ్ఞాపిక ఇస్తున్న ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణవనం: వర్క్‌షాప్ విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు దోహదం చేస్తుందని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ అశోక్‌రాజ్ అన్నారు. బెంగళూరుకు చెందిన ఎస్ఎఫ్ఎక్స్ టెక్నాలజీ అకాడమీతో సంయుక్తంగా సిద్ధార్థ కళాశాలలో నిర్వహించిన రెండు వారాల వర్క్‌షాప్ మంగళవారం ముగిసింది. సైన్స్ అండ్ ఇంజినీరింగ్, సీఎస్ఎం, సీఐసీ, సీవీడీ, సీసీసీ, సీఎస్ఐటీ స్పెషలైజేషన్‌కు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వర్క్‌షాప్‌కు హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన వారికి కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన ముగింపు సమావేశంలో ప్రశంసా పత్రాలను చైర్మన్ డాక్టర్ అశోకరాజు అందజేసి పైవిధంగా మాట్లాడారు. వృత్తి విద్యాకోర్సుల్లో నైపుణ్యత తోడైతే మంచి అవకాశాలను పొందవచ్చునని ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గోపినాథ్, విభాగాధిపతులు గీతావాణి, రాజకుమార్, సమన్వయకర్తలు కుమార్, ఇందిరావతి, ట్రైనర్లు తేజగౌడ, మణికంఠ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్తూరు రెడ్డి జేఏసీ కార్యవర్గం ఎన్నిక

చిత్తూరు రూరల్: నగరంలోని రెడ్డి జేఏసీ కార్యాలయంలో మంగళవారం పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శివారెడ్డి, ఉపాధ్యక్షులుగా గిరిబాబురెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, కార్యదర్శిగా యాగమరెడ్డి, ప్రచార కార్యదర్శిగా నరసింహారెడ్డి, యువత అధ్యక్షుడిగా మునీంద్రబాబు, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా గిరిబాబురెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడిగా చిట్టిరెడ్డిని ఎన్నుకున్నారు. వారికి నియమాక పత్రాలను అందజేశారు. పలు సేవా కార్యక్రమాలతో అసోసియేషన్‌ను బలోపేతం చేస్తామని నూతన కార్యవర్గం ప్రకటించింది. బ కార్పొరేటర్ హరిణిరెడ్డి, అసోసియేషన్ పెద్దలు రాధికా రెడ్డి, గోపినాథ్‌రెడ్డి, సుగుణశేఖర్‌రెడ్డి, హేమబిందు రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.